క్లుప్తంగా

వైభవంగా దీపారాధన



అర్వపల్లి చిన్నదర్గాలో దీపాలు వెలిగిస్తున్న నిర్వాహకులు, భక్తులు

అర్వపల్లి : అర్వపల్లి శివారులోని గుట్టల మధ్య ఉన్న సయ్యద్ జాన్‌పాక్ షహీద్‌ఖాజా మొయినోద్దీన్‌బాబా దర్గా (చిన్నదర్గా) ఉర్సులో భాగంగా శనివారం రాత్రి దీపారాధన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆ తర్వాత గొసేపాక్‌దర్గాలో కూడా దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో దర్గా ముత్తవల్లి ఎండీ. హబీబ్‌రెహమాన్, జానీ, అబ్దుల్, బషీర్, యాకూబ్, వెంకన్న, ఫజల్‌రహమాన్, ముజీబ్, మజీద్, భక్తులు పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా బిక్కి బుచ్చయ్యగౌడ్



నూతనకల్ : గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలపరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన బిక్కి బుచ్చయ్యగౌడ్‌ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిత్తలూరి నారాయణ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎలికట్టె విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు అతడిని నియమించినట్లు తెలిపారు.

సదరమ్ క్యాంపు స్లాట్ బుకింగ్ టైం పొడిగించాలి

పెన్‌పహాడ్ : సదరమ్ క్యాంపు స్లాట్ బుకింగ్ టైంను పెంచాలని సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంతో మంది వికలాంగులు మీ సేవా వద్దకు వెళ్లి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అన్ని గ్రామాల్లో మీ సేవా సౌకర్యం లేక మండల కేంద్రానికి వచ్చేసరికి టైం అయిపోవడంతో వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా మండల కేంద్రంలో క్యాంప్ ఏర్పాటు చేయాలని, జిల్లా అధికారులు స్పందించి స్లాట్ బుకింగ్ టైం మూడు గంటల పాటు కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

3న కలెక్టరేట్ ఎదుట ధర్నా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

తుంగతుర్తి : దళిత బంధు పథకంలో నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3న సూర్యాపేటలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పాల్వాయి పరశురాములు కోరారు. శనివారం మండలకేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా దళిత బంధును అమలు చేయాలన్నారు. అలాగే ఫిబ్రవరి 14న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద దండోరా మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్వాయి సూరయ్య, వంగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితుడి మృతికి సంతాపం

చివ్వెంల : ఫ్లోరోసిస్ బాధితుడు అంశాల స్వామి మృతి పట్ల గుంపుల గ్రామంలో భారత వికలాంగ హక్కుల పోరాట సమితి(బీవీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి ఈదయ్యబాబు, మున్న మధు, కుర్ర గోపి, గుర్రం నరేష్ రెడ్డి, సుధాకర్, పావని, సరిత తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి, రావుల పాలనకు చరమగీతం పాడుదాం



పాదయాత్రలో పాల్గొన్న విశారదన్

పెన్‌పహాడ్: తెలంగాణంలో రెడ్డి, వెలమ దొరల పాలనకు చరమగీతం పాడుదామని డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ పేర్కొన్నారు. శనివారం రాత్రి మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం మీదుగా పెన్‌పహాడ్ మండల కేంద్రానికి 10వేల కిలో మీటర్ల స్వరాజ్య పాదయాత్ర చేరుకున్న సందర్భంగా డీఎస్పీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. 10శాతం లేని అగ్రకుల దొరల రాజ్యాన్ని దింపి 90శాతం ఉన్న బీసీ, ఎస్టీ, ఎస్సీల రాజ్యాన్ని నిర్మించేందుకే ఈ స్వరాజ్య పాదయాత్ర అని అన్నారు. కార్యక్రమంలో స్వరాజ్య పాదయాత్ర ఇన్‌చార్జ్ లక్ష్మణ్, డీఎస్పీ జిల్లా కన్వీనర్ కిరణ్‌కుమార్, కుమారి, మండల అధ్యక్షుడు సైదులు, శ్రీనివాస్, రాంబాబు, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

‘తొలిమెట్టు’తో సత్ఫలితాలు

- చదవడం, రాయడంలో మెరుగవుతున్న విద్యార్థులు
- ఉపయోగపడుతున్న టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్)



బోధనను పరిశీలిస్తున్న మండల నోడల్ అధికారి వస్త్రాంనాయక్

పెన్‌పహాడ్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన తొలిమెట్టు కార్యక్రమంతో పాఠశాలలు సత్ఫలితాలు సాధిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజు తొలిమెట్టు కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తుడడంతో విద్యార్థులు నైపుణ్యాలు సాధించగలుగుతున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించింది. అందులో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో విద్యార్థులకు పెంపొందించాలని సూచించింది. ఈ నేపథ్యంలోనే తొలిమెట్టు విజయవంతమయ్యేలా కొంతమంది ఉపాధ్యాయులకు నోడల్ అధికారులుగా బాధ్యతలు అప్పగించింది. మండలంలోని 29 గ్రామపంచాయతీల్లో 4 ప్రాథమికోన్నత, 40ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 2540 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

తనిఖీలు, పర్యవేక్షణలు..

జిల్లా స్థాయి అధికారుల నుంచి మండల స్థాయి అధికారుల వరకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణలు కొనసాగుతుండడంతో ఉపాధ్యాయులు అప్రమత్తంగా బోధన సాగిస్తున్నారు. వచ్చిన ప్రతి అధికారి విద్యార్థులతో పుస్తకాలు చదివించడంతో పాటు చతుర్విధ ప్రక్రియలు చేయిస్తున్నారు. మండల, క్లస్టర్ నోడల్ అధికారులు తొలిమెట్టు కార్యక్రమాలను నిత్యం పర్యవేక్షిస్తున్నారు. తరగతి బోధనను పరిశీలిస్తూ సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఉపాధ్యాయులు సైతం ముందస్తుగానే సిద్ధమై పాఠశాలలకు వచ్చి బోధన చేస్తున్నారు. తరగతులు, పాఠ్యాంశాల వారీగా బోధన చేస్తుండడంతో పాఠశాలల్లో విద్యాబోధన మెరుగుపడుతుంది.

బోధనతో మెదడుకు పదును..

టీఎల్‌ఎం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతోంది. టీఎల్‌ఎం బోధనలతో విద్యార్థులు మెదడుకు పదును పెడుతున్నారు. నూతన, వినూత్న విధానాలతో, సృజనాత్మకతతో టీఎల్‌ఎంలు తయారు చేసి విద్యార్థులకు వివరిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆయా క్రియల్లో ఉత్సాహంగా పాల్గొని మెరుగవుతున్నారు.

విద్యార్థుల సామర్థ్యం పెరిగింది



తొలిమెట్టును పకడ్బందీగా అమలు చేయడంతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం, పఠనా సామర్థ్యం పెరిగాయి. వివిధ కృత్యాలు చేయించడంతో పిల్లల్లో నేర్చుకోవాలనే తపన, తెలుసుకోవాలనే జిజ్ఞాస పెరిగాయి. వెనుకబడిన విద్యార్థులకు కూడా వివిధకృత్యాలు అప్పగించడంతో వారు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు.

– వస్త్రాంనాయక్, మండల నోడల్ అధికారి

ఉచితంగా విద్య, వైద్యం అందించాలి



సంఘం సభ్యత్వం అందిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : వ్యవసాయ కార్మికులకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని ఏపూరు గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో 60 శాతంకు పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి ప్రభుత్వం ఉచితంగా విద్య, వైద్యం, ఉపాధి కల్పించాల్సి ఉందన్నారు. స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా నేటికీ వ్యవసాయ కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు బోయిళ్ల సాంబయ్య, కల్లుగీత కార్మిక సంఘం మండల కార్యదర్శి బెల్లంకొండ ఇస్తారి, నాయకులు జయమ్మ, వెంకన్న, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖలో భారీగా పెరిగిన వడ్డీరేట్లు

తుంగతుర్తి : తపాలా శాఖలో ఉన్న పోస్టల్ పథకాలకు వడ్డీ రేట్లు భారీగా పెరిగాయని సూర్యాపేట జిల్లా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గౌనీ సురేష్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి పోస్టాఫీస్ వడ్డీరేట్లను సవరిస్తుందన్నారు. సేవింగ్ అకౌంట్లపై 4శాతం, రికరింగ్ డిపాజిట్‌పై 5.8శాతం, టైం డిపాజిట్ అకౌంట్‌పై 6.6శాతం, మంత్లీ ఇన్‌కం స్కీంకు 7.1శాతం, నేషన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌కు 7శాతం, కిసాన్ వికాస్‌కు 7.2శాతం, సీనియర్ సిటిజన్ అకౌంట్‌కు 8శాతం, సుకన్య సమృద్ధి అకౌంట్‌కు 7.6శాతం, పీపీఎఫ్ అకౌంట్‌కు 7.1 శాతం వడ్డీ లభిస్తుందని తెలిపారు. పెరిగిన వడ్డీరేట్లను ప్రజలు సద్వినియోగం చేసుకొని, పొదుపు చేసుకోవాలని కోరారు. ఆయనతో పాటు పోస్టల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ముత్తయ్య, తదితరులు

నాగారం : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జి.ముత్తయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఆన్‌లైన్ లాటరీలు, బహుమతులు గెలిచారని వచ్చే ఫోన్‌కాల్స్‌ను ప్రజలు నమ్మవద్దని సూచించారు. సైబర్ నేరాల కారణంగా అనేక మంది మోసపోయి తమ డబ్బులు పోగొట్టుకుంటున్నారని, ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, ఏటీఎం నంబర్లు, ఓటీపీ వివరాలను బహిర్గతం చేయవద్దని అన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జమీందర్ వెంకన్న, కానిస్టేబుల్స్ లింగయ్య, ఆంజనేయులు, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

హ్యుందయ్ గ్రాండ్ ఐ10 నియో మోడల్ ఆవిష్కరణ

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 7స్టార్ హోటల్ సమీపంలో ఉన్న సన్నాయ్ హ్యుందయ్ కార్ల షోరూం నందు నూతన మోడల్ గ్రాండ్ ఐ10 నియోను ఆర్టీఏ అధికారి వెంకటయ్య శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనదారులు నూతనంగా వస్తున్న టెక్నాలజీని ఆదరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో షోరూం ఎండీ వినీలారెడ్డి, షోరూం సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.



గ్రాండ్ ఐ10 నియో మోడల్ కారును ఆవిష్కరిస్తున్న ఆర్టీఏ అధికారి వెంకటయ్య

ఘనంగా రథసప్తమి వేడుకలు



శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వేడుకల్లో పాల్గొన్న భక్తులు



స్వామివారి రథాన్ని ఊరేగిస్తున్న వేదాంత భజన మందిరం సభ్యులు

భానుపురి : పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 5.30గంటలకు స్వామివారికి నవకలశ తిరుమంజన స్నపనం నిర్వహించారు. అనంతరం ఆవుపిడకలపై ఆవు పాలతో పాయసం తయారు చేసి సూర్య నారాయణ భగవానుడికి నివేదించారు. భక్తులంతా ఆదిత్య హృదయం పఠించి సూర్య నమస్కారాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, కార్య నిర్వహణ అధికారి వై.శ్రీనివాసరెడ్డి, అర్చకులు శ్రీహరిఆచార్యులు, సంకర్షణాచార్యులు, హరిచరణ్ ఆచార్యులు, ఫణికుమార్ ఆచార్యులు పాల్గొన్నారు.

వేదాంత భజన మందిరం ఆధ్వర్యంలో..

రథసప్తమి సందర్భంగా వేదాంత భజన మందిరం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్య భగవానుడికి నైవేద్యం సమర్పించి రథయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు రాచర్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నకిరేకంటి నాగరాజు, కోశాధికారి సోమ అశోక్, వెంపటి సురేష్, వీరవెల్లి రామ్మూర్తి, వరగాని వెంకటేశ్వర్లు, కక్కిరేణి విజయ్, ఈగా వెంకటేశ్వర్లు, వనమా విద్యాసాగర్, అర్చకులు దరూరి శింగరాచార్యులు, రాఘవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు ఉద్యమిద్దాం



నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి

దురాజ్‌పల్లి : అమరవీరుల ఆశయాల సాధనకు ఉద్యమిద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కొలిశెట్టి వజ్రమ్మ సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం జరిగిన పోరాటంలో అమరులైన వారి త్యాగాలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్, డీటీఎఫ్ జిల్లా నాయకుడు దశరథ రామారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, శ్రీరాములు, మట్టిపెల్లి సైదులు, వెంకటేశ్వరరావు, చెరుకు ఏకలక్ష్మి, కోట గోపి, తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న గౌడ సంఘం నాయకులు

నాగారం : మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు శనివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 370 ఏళ్ల క్రితమే బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని తీసుకొచ్చిన మహనీయుడు సర్దార్ పాపన్న అని కొనియాడారు. పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వం పాపన్న జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి, పాపన్న జయంతి, వర్ధంతిలను అధికారికంగా గుర్తించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు నాతి యాకస్వామి, అంబటి మధు, మాదా ముత్యాలు, ఆకుల మల్లయ్య, సోమరాజు, రాజు, గీతకార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చివ్వెంల : మండల పరిధిలోని దురాజ్‌పల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు మండల విద్యుత్ ఏఈ రమేష్ తెలిపారు. దురాజ్‌పల్లి, రామ్‌కోటితండా, బాయితండా, వల్లభాపురం, తుల్జారావుపేట, ఉండ్రుగొండ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మలు తొలగించే క్రమంలో అంతరాయం ఏర్పడుతుందని అన్నారు.

విగ్రహాల పునఃప్రతిష్ఠ ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని శ్రీ శంభులింగేశ్వర స్వామి ఆలయంలో శివలింగ పునః ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు మురళయ్య శర్మ మంత్రోచ్చరణల నడుమ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. యంత్ర ప్రతిష్ఠాపన, మూర్తి ప్రతిష్ఠ, నేత్రోన్మేలనము, బలిహరణ, కుంభ నివేదన, అలంకరణ, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠ ఉత్సవాలకు గానూ సర్పంచ్ తూముల శ్వేత సురేష్‌రావు రూ. 36వేల విరాళాన్ని దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. తూముల జగదీశ్వర్‌రావు జ్ఞాపకార్థం భార్య ప్రభావతి, కుమారులు మోహిత్, సాయిప్రసాద్ అన్నదానం నిర్వహించారు.

కౌశిక్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రామచంద్రయ్య

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ నాయకుడు, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామచంద్రయ్య డిమాండ్ చేశారు. శనివారం తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు అవగాహన లేకుండా, రాజ్యాంగం పట్ల గౌరవం లేకుండా, మహిళలు అని చూడకుండా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు బొట్టు అబ్బయ్య, ఎం.యాదగిరి, వై.ధీన్‌దయాళ్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, గౌరి శ్రీనివాస్, బయ్యని రాజు, మల్లారెడ్డి, నరేష్, బంగారు స్వామి, స్వామి, దేవరాజ్, సుభాష్‌రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతర పనుల పరిశీలన



పెద్దగట్టు వద్ద పనులను పరిశీలిస్తున్న ఈఈ

చివ్వెంల : మండల పరిధిలోని దురాజ్‌పల్లి శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ ఈఈ జీకేడీ. ప్రసాద్ అన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను శనివారం పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఈ సత్యారావు, ఏఈ రాజురెడ్డి, ఎస్‌ఎస్‌ఆర్. ప్రసాద్ పాల్గొన్నారు.

మహాసభ కరపత్రం విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : ప్రగతిశీల యువజన సంఘం మండల మహాసభను జయప్రదం చేయాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య అన్నారు. మండల పరిధిలోని బొప్పారం గ్రామంలో ఫిబ్రవరి 4న జరిగే మండల మహాసభ కరపత్రాలను శనివారం సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దేశం కోసం, సమాజ మార్పు కోసం ప్రాణాలను త్యాగం చేసిన భగత్ సింగ్, ఆజాద్, అల్లూరి వారసులుగా యువత ప్రజా సమస్యలపై పోరాటాలకు ముందుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ మండల నాయకులు గుండబోయిన రాజు, గద్దం సందీప్, శ్రీరాములు, దారమళ్ల నగేష్, ముత్యాలు, మల్లయ్య, లింగయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సొసైటీ క్యాలెండర్ల ఆవిష్కరణ



తిరుమలగిరి : హైదరాబాద్‌లో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సినీనటుడు సుమన్



తుంగతుర్తిలో గీత కార్మిక సంఘం క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం నాయకులు

తిరుమలగిరి : టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ క్యాలెండర్‌ను హైదరాబాద్‌లో ప్రముఖ సినీ హీరో సుమన్ చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్ గౌడ్, సహాయ కార్యదర్శి ముత్తినేని హన్మంతు, ప్రచార కార్యదర్శి సురాంభ, చందర్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, ఎల్లయ్య, పద్మ, వెంకన్న పాల్గొన్నారు.

గీత పనివారల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

తుంగతుర్తి : జిల్లా కేంద్రంలో నీరా కేంద్రాన్ని ఏర్పాటు చేసి గీతకార్మికులకు ఉపాధి కల్పించాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో గీత పనివారల సంఘం నూతన క్యాలెండర్లను ఆవిష్కరించి మాట్లాడారు. గీత కార్మికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి జీవన అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పులిపలుపుల సైదులు, రాజారాం, శ్రీనివాస్, కేశగాని సైదులు, సంతోష్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకురాలికి నివాళి

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన సీపీఎం నాయకురాలు దేవరకొండ యాదమ్మ శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా శనివారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బుర్ర శ్రీనివాస్, పుసులు సత్యంలు మృతురాలి భౌతికకాయాన్ని సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శులు కడియం కుమార్, శ్రీనివాస్, దేవరకొండ యాదగిరి, శిగ వెంకన్న, దేవరకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీపీ కవిత

తుంగతుర్తి : విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు.ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కా ర్యక్రమంలో ఎంఈఓ బోయిని లింగయ్య, ఎస్ఓ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మద్దిరాల : జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్న తండ్రి నామాల వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి చిత్రపటానికి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ శనివారం నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్, జెడ్పీటీసీలు కన్న సురాంభ వీరన్నగౌడ్, కందాల దామోదరరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు బంధు సమితి జిల్లా సభ్యుడు మల్లు కపోత్తంరెడ్డి, వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, మల్లు కళింగారెడ్డి, తీగల వెంకన్నగౌడ్, వడ్డాణం మధుసూదన్, యూత్ నాయకులు మల్లు ఉపేందర్‌రెడ్డి, వల్లపు రమేష్, సురేందర్‌రెడ్డి, వెంకన్న, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

నూతనకల్ : మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గాడ్దుల అవిలయ్య మాతృమూర్తి లింగమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ శనివారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కందాల దామోదర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, భూరెడ్డి సంజీవరెడ్డి, ఎంపీటీసీ గాడ్దుల రజితలింగరాజు, బద్దం ప్రశాంత్‌రెడ్డి, పన్నాల మల్లారెడ్డి, బిక్కి బుచ్చయ్య, తాడూరి లింగయ్య, మన్నెం రమేష్ పాల్గొన్నారు.



మద్దిరాల : చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



నూతనకల్ : ఎర్రపహాడ్‌లో..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

చిలుకూరు : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చిలుకూరు గ్రామ పరిధిలోని కవితా జూనియర్ కళాశాల సమీపంలో కోదాడ- హుజూర్‌నగర్ రోడ్డుపై శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతవోలు గ్రామానికి చెందిన రాజేష్, నాగరాజులు బేతవోలు నుంచి పని నిమిత్తం కోదాడకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరిలో రమేష్‌కు కాలు విరిగింది. నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అక్కడకు చేరుకుని వారిని చికిత్స నిమిత్తం కోదాడ వైద్యశాలకు తరలించారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : తిమ్మాపురం గ్రామానికి చెందిన నందికి సత్యనారాయణరెడ్డి ఇటీవల మృతిచెందడంతో మృతుడి కుటుంబీకులకు శనివారం టీఎంపీఎస్ రాష్ట్ర చైర్మన్ ఈదునూరి సంతోష్‌ముదిరాజ్ రూ.5వేలు ఆర్థి కసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లగుంట్ల నరేష్, బింగి బాలరాజు, సందీప్, శ్యామ్, సుధ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఊరేగింపు

కోదాడ : పట్టణంలోని పుర వీధుల్లో బోడిగుట్టపై నిర్మించిన లింగమంతుల ఆలయంలో ప్రతిష్ఠించనున్న దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపును శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ వాసులు దేవాతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

నూతనకల్ : మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామానికి చెందిన జటంగి నాగమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై వైద్యచికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంది. దీంతో ఆమెకు రూ. 55వేల చెక్కు మంజూరైంది. ఆ చెక్కును సర్పంచ్ చూడి లింగారెడ్డి శనివారం లబ్ధిదారుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పన్నాల సైదిరెడ్డి, రచ్చ రాజు, పల్స శ్రీహరి, నెల్లుట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న సర్పంచ్